క్లుప్తంగా

రోడ్డుకు మరమ్మతులు



రోడ్డుకు కాంక్రీట్‌తో మరమ్మతులు చేయిస్తున్న రవీందర్

నందిగామ: మండల పరిధిలోని నర్సప్పగూడ నుంచి టెక్స్‌టైల్ పార్క్ వెళ్లే రోడ్డులో చేగూరు వద్ద గుంతలతో ప్రమాదకరంగా ఉన్న రోడ్డుకు నర్సప్పగూడకు చెందిన మాజీ ఉపసర్పంచ్ నీరటి రవీందర్‌ముదిరాజ్ బుధవారం తన సొంత డబ్బుతో మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. టెక్స్‌టైల్ పార్క్ రోడ్డు వద్ద బీటీ రోడ్డుకు మట్టి రోడ్డుకు మధ్య పెద్దఎత్తున గోతులు ఉండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ప్రమాదాల నివారణకు సొంత డబ్బుతో రోడ్డుకు కాంక్రీట్ పోయించినట్లు వెల్లడించారు. దీంతో వాహనదారులకు మార్గం సుగమమైంది.

మాల మహానాడు మండల కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులకు నియామకపత్రం అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు మహేశ్

షాద్‌నగర్: పట్టణంలోని మాల మహానాడు సంఘం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో మాల మహానాడు ఫరూఖ్‌నగర్ మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా కమ్మదనం గ్రామానికి చెందిన చించేటి శేఖర్, ప్రధాన కార్యదర్శిగా బ్యాగరి బాల్‌రాజ్, ఉపాధ్యక్షులుగా మాల యాదగిరి, దార శివశంకర్, బర్ల శ్రీనివాస్, లింగం, శేఖర్, కోశాధికారిగా ప్రవీణ్‌కుమార్, సలహాదారులుగా బలరాం, యాదయ్య, రాజు, రవికుమార్, మల్లేశ్, జంగయ్య, యాదగిరిలను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్ మాల నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బీష్వ రామకృష్ణ, శ్రీను, మణి, కృష్ణ, రాంచందర్, మహేందర్, అశోక్, యాదయ్య, బాల్‌రాజ్, అంజి, పాండు తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్‌రూరల్: పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సీతా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఖాళీగా ఉన్న మైక్రో బయోలజీ, ఫిజికల్ కెమిస్ట్రీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ సబెక్టులలో బోధించుటకు అతిథి అధ్యాపకులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు సంబంధిత పీజీ కోర్సుల్లో 55శాతం మార్కులతో ఉత్తీర్ణత కలిగి ఉండాలని సూచించారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా కళాశాలకు రావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 63026 66957 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.

సంధ్యారాణికి డాక్టరేట్

మొయినాబాద్‌రూరల్: ఉన్నత విద్యలో పరిశోధనలు చేస్తున్న అధ్యాపకులు ప్రజలకు ఉపయోగపడేలా ఉన్నప్పుడే వాటిని గుర్తిస్తారని చైతన్య డీమ్డ్ టుబీ యూనివర్సిటీ అడ్మినిస్ట్రేట్ అధికారి ప్రొఫెసర్ డాక్టర్ సాత్వికరెడ్డి అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామ సమీపంలో గల ఆ యూనివర్సిటీలో రసాయన శాస్త్ర విభాగంలో బండి సంధ్యారాణి పరిశోధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు డాక్టరేట్ లభించడంతో అడ్మినిస్ట్రేట్ అధికారి సాత్వికరెడ్డి పట్టాను అందజేశారు. సాత్వికరెడ్డి మాట్లాడుతూ.. పరిశోధనలు ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని సూచించారు. జీవితంలో ఉన్నతమైన స్థాయిలో నిలవడానికి గుర్తింపు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ రవీందర్, క్రిష్టఫర్, సుందర్ రామ్, రాంబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థిని



విద్యార్థిని వైష్ణవి

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని తోల్‌కట్ట సమీపంలోని రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థిని ఎస్.వైష్ణవి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పి.మాలతి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు ఆమెను అభినందించారు. ఇటీవల 68వ రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు ఖమ్మంలో నిర్వహించగా వైష్ణవి అండర్-14 విభాగం అథ్లెటిక్ పోటీల్లో పాల్గొని జాతీయస్థాయికి ఎంపికైంది. ఝార్ఖండ్‌లో డిసెంబర్ మొదటి వారంలో జరిగే పోటీల్లో విద్యార్థిని వైష్ణవి ఆడనున్నట్లు తెలిపారు.

అధ్వాన రోడ్లతో అవస్థలు

- ఏళ్ల తరబడి మరమ్మతులు నిల్
- నరకయాతన పడుతున్న వాహనదారులు, ప్రజలు
- గుంతలతో తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



గుంతలమయంగా నక్కలపల్లి సమీపంలో రోడ్డు



అధ్వానంగా కేతిరెడ్డిపల్లి-శంషాబాద్ రహదారి

మొయినాబాద్‌రూరల్: మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే రోడ్లు పూర్తిగా అధ్వానంగా తయారయ్యాయి. ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. వర్షాలకు ఈ రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, గుంతలు, కంకర తేలిన రోడ్లపై ప్రయాణం నరకంగా మారిందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం చేయాల్సి వస్తోందని, గుంతల్లో వాహనాలు బోల్తాపడి ప్రమాదాలు జరిగిన సంఘటనలు చాలా ఉన్నాయని ఆరోపిస్తున్నారు. అయినా అధికారులు చూసీ చూడనట్లు ఉండడం ఏమిటని, ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్ల అభివృద్ధి, మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

అడుగడుగునా గుంతలే!

మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే రోడ్లు, ప్రధాన రహదారులు గుంతలమయంగా మారాయి. మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో 80 శాతం రోడ్ల దుస్థితి దయనీయంగా మారింది. ఏ గ్రామానికి వెళ్లినా గుంతల రోడ్లే దర్శనమిస్తున్నాయి. పలుమార్లు అధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లినా పరిస్థితి ఏ మాత్రం మారలేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. వర్షాలకు ఈ రోడ్లు పూర్తిగా దెబ్బతిని బీటీరోడ్లు మొత్తం కంకర తేలి గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్లపై ప్రయాణం నరకయాతనగా మారిందని వాహనాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాలు సైతం దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని తోల్‌కట్ట గేటు సమీపం నుంచి ఎత్‌మార్‌పల్లి, నక్కలపల్లి వరకు, అదేవిధంగా కనకమామిడి నుంచి కంచమోనీగుడ, చాకలిగూడ వరకు, నక్కలపల్లి నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్లే రహదారి అయిన అటూ శంషాబాద్, ఇటూ చేవెళ్లకు కేతిరెడ్డిపల్లి, చాకలిగూడ, వెంకటాపూర్, కందవాడ గ్రామాల రోడ్లు పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా దర్శనం ఇస్తున్నాయి. అధికారులు ఈ రోడ్లను పట్టించుకున్న పాపానపోలేదని ప్రజలు వాపోతున్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అయినా గ్రామీణ రోడ్లపై దృష్టి సారించాలని ఆయా గ్రామాల ప్రజలు వాహనాదారులు కోరుతున్నారు.

వాహనాలు పాడవుతున్నాయి



గ్రామాల్లోని ప్రధాన రోడ్లు గతంలో నిర్మించారు. మళ్లీ ఈ రోడ్లను పట్టించుకున్న వారే లేరు. ముఖ్యంగా కనకమామిడి నుంచి కంచమోనిగూడ, చాకలిగూడ, వెంకటాపూర్, టోల్‌కట్ట నుంచి ఎత్‌మార్‌పల్లి, నక్కలపల్లి రోడ్లు పూర్తిగా అధ్వానంగా మారాయి. బీటీ రోడ్లు కంకర తేలి గుంతలు ఏర్పడ్డాయి. ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారు రాత్రి వేళల్లో ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనాలు పూర్తిగా దెబ్బతింటున్నాయి. ఇప్పటికైనా అధికారులు కనీస మరమ్మతులైనా చేయించాలి.

–దారెడ్డి వెంకట్‌రెడ్డి, కేతిరెడ్డిపల్లి

మరమ్మతులు చేపట్టాలి



మండల పరిధిలోని నక్కలపల్లి నుంచి శంషాబాద్ వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రోడ్లపై వెళ్లే వాహనాదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై అడుగడుగునా గుంతలు, కంకర తేలి ఉండడంతో వాహనదారులు ప్రయాణం చేయాలంటేనే భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతల రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి.

–ప్రవీణ్‌రెడ్డి, ఎత్‌మార్‌పల్లి గ్రామస్తుడు.

నిధులు మంజూరయ్యాయి

మండలంలోని రోడ్ల అభివృద్ధితో పాటు మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. ఇందుకుగాను టెండర్లు వేశాం. టెండర్లు పూర్తికాగానే పనులు ప్రారంభిస్తాం. పనులు త్వరగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

–విజయ్‌కుమార్, పంచాయతీ రాజ్ డిప్యూటీ డీఈ

గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు

- డిసెంబర్ 4 వరకు కొనసాగనున్న స్పెషల్ డ్రైవ్
- పనులను పరిశీలించిన ఎంపీఓ విఠలేశ్వర్‌జీ



దామరగిద్దలో రోడ్లపక్కన చెత్తా చెదారాన్ని తొలగిస్తున్న సిబ్బంది

చేవెళ్ల: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టినట్లు ఎంపీఓ విఠలేశ్వర్‌జీ తెలిపారు. బుధవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు ప్రారంభించామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ రోజు గ్రామాల్లో ఒక్కో కార్యక్రమం చేపడతామన్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి వచ్చే నెల డిసెంబర్ 4వ తేదీవరకు గ్రామాల్లో ఈ ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు. మొదటిరోజు గ్రామాల్లోని వీధుల్లో రోడ్ల వెంట ఉన్న చెత్తచెదారాలను తొలగించడం, నర్సరీలను శుభ్రం చేయటం, మరుగు కాల్వలు, పిచ్చి మొక్కలు తొలగించే కార్యక్రమాలు ఆయా గ్రామాల్లో కార్యదర్శులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాభివృద్ధిలో భాగంగా చేపడుతున్న కార్యక్రమాలకు గ్రామస్తులు సహకారం అందించాలని చెప్పారు. తడి, పొడి చెత్తను వేరుచేసి మున్సిపల్ సిబ్బందికి ఇవ్వాలని సూచించారు. అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టే కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. మండలంలోని పలు గ్రామాల్లో ఎంపీడీఓ పర్యటించి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థికి అభినందన



విద్యార్థిని సన్మానిస్తున్న హెచ్‌ఎం రేణుక, ఉపాధ్యాయులు

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రస్థాయి క్రీడలకు అమ్డాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి కుమారి గౌరీ ఎంపిక కావడం అభినందనీయమని హెచ్‌ఎం రేణుక అన్నారు. బుధవారం పాఠశాల ఆవరణలో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థిని కుమారి గౌరీని అభినందిస్తూ సన్మానించారు. ఎర్త్ వైల్ జిల్లా మల్కాట్ సెలక్షన్‌లో భాగంగా అమ్డాపూర్ విద్యార్థిని అండర్-14 బాలికల విభాగంలో జిల్లా స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. పాఠశాలలో అధ్యాపకులు, విద్యార్థులు సన్మానించి అభినందించారు. రేణుక మాట్లాడుతూ.. విద్యతో పాటు అన్ని రంగాల్లో పాల్గొన్నప్పుడే విజ్ఞాన వంతులుగా ఎదుగుతారన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, అలివేలు మంగ, సౌభాగ్య, లక్ష్మి, సోభారాణి, జ్యోతి, మహేశ్వరి, రాంశంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

వరికొయ్యలను కాల్చొద్దు

మండల వ్యవసాయ అధికారి అనురాధ

మొయినాబాద్‌రూరల్: వరిసాగు చేసిన రైతులు వరి పంటను కోసిన తర్వాత పంట పొలాల్లో ఉన్న వరి కొయ్యలను కాల్చొద్దని, కాల్చడం ద్వారా వాతావరణం కాలుష్యం అవడమే కాకుండా భూసారవంతం తగ్గుతుందని మండల వ్యవసాయ అధికారి అనురాధ పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. వరి కొయ్యలకు పంట పొలాల్లో నిప్పు పెట్టడంతో వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందని, భూసారం తగ్గుతుందని తెలిపారు. కొయ్యలను అలాగే భూమిలోనే దున్నడం ద్వారా నేలసారాన్ని కాపాడుకోవచ్చన్నారు. వ్యవసాయంలో ప్రస్తుతం కూలీల కొరత ఉండడంతో రైతులు యంత్రాలను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. వరి కోతలకు మిషిన్‌లను ఉపయోగించి భూమిలో ఉన్న కొయ్యలను తగులబెడుతున్నారన్నారు. గడ్డిని పశుసందపఉన్నవారు వినియోగించుకోవచ్చని తెలిపారు. వరి కొయ్యలు తగులబెట్టడంతో భూసారానికి ముప్పు పొంచి ఉందని ఆమె తెలిపారు.

పార్కింగ్ స్థలాన్ని కాపాడాలి



కమిషనర్ జ్ఞానేశ్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ విజయలక్ష్మి

మీర్‌పేట: కబ్జా అయిన పార్కింగ్ స్థలాన్ని రక్షించాలని మీర్‌పేట కార్పొరేషన్ 31వ డివిజన్ కార్పొరేటర్ విజయలక్ష్మి బుధవారం కమిషనర్ జ్ఞానేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. జనప్రియ మహానగర్‌లోని 5వ బ్లాకులో పార్కింగ్ నిమిత్తం కేటాయించిన స్థలాన్ని కొందరు కబ్జాచేసి షెటర్లు నిర్మించి రియల్ ఎస్టేట్, ఓ పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారని కమిషనర్‌కు వివరించారు. స్పందించి షెటర్లను తొలగించి పార్కింగ్ కోసం కేటాయించిన స్థలాన్ని తిరిగి ఇప్పించేలా చొరవ తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు.

స్వయం కృషితో అభివృద్ధి చెందాలి



మహిళలకు కుట్లు అల్లికలు నేర్పిస్తున్న ట్రైనర్ సుభాషిణి

షాబాద్: మహిళలు స్వయం కృషితో కుట్లు, అల్లికలు నేర్చుకుని అభివృద్ధి చెందాలని వెల్స్‌పన్ ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో వెల్స్‌పన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్లు, అల్లికల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. షాబాద్‌లో 40 మంది మహిళలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిక్షణ కేంద్రాల్లో కుట్లు, అల్లికలు నేర్పిస్తున్నట్లు చెప్పారు. మహిళలు ఇంట్లోనే కూర్చొని ఆదాయం పెంచుకోవడానికి వివిధ రకాలుగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతీ మహిళ ఏదో ఒక వృత్తి నైపుణ్య శిక్షణ నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనర్ సుభాషిణి, కార్యదర్శి అనిత తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

షాద్‌నగర్: ఆధ్యాత్మికత చింతనతో ప్రతి ఒక్కరికి మానసిక ప్రశాంతంత లభిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు ఫరూఖ్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన ఆంజనేయ, వినాయకస్వామి, నవగ్రహ సహిత జీవ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిలు పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రావణి, జమ్ముద్‌ఖాన్, బాబర్‌ఖాన్, బస్వం, ఇబ్రహీం, అప్పి, కట్టా వెంకటేశ్‌గౌడ్, కృష్ణారెడ్డి, తుపాకుల శేఖర్, సుదర్శన్, ముబారక్, సందీప్‌గౌడ్, ఆనంద్, వీరేశం, మహేశ్, సాయి, యాదయ్య పాల్గొన్నారు.

హనుమాన్ దేవాలయంలో అన్నప్రసాద వితరణ

పట్టణ శివారులోని చొడమ్మగుట్ట హనుమాన్ దేవాలయ ఆవరణలో అయ్యప్ప భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా అయ్యప్ప సమాజం భక్తులు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అయ్యప్ప భక్త సమాజం సభ్యులు వన్నాడ వెంకటేశ్‌గౌడ్, గూనెళ్ళి రమేశ్, బాల్‌రెడ్డి, అశోక్, రవీందర్, రమేశ్, పోలె రాజేశ్వర్, బస్వం, శ్రీశైలంగౌడ్, కట్టా వెంకటేశ్, కొమ్ము కృష్ణ, మురళీ తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తుకు బానిస కావొద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్‌గౌడ్

సీఐ శ్రీనివాస్‌గౌడ్

శంకర్‌పల్లి: పాఠశాలలు, కళాశాల విద్యార్థులు నిషేధిత మత్తు పదార్థాలకు బానిసలుగా మారి బంగారు జీవితాలను నాశనం చేసుకోవద్దని సీఐ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో యాంటీ డ్రగ్స్, యాంటీ ర్యాగింగ్, మైనర్ డ్రైవింగ్‌లపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రోడ్లపై మైనర్లు వాహనాలు నడుపుకుంటూ రావడంతో పెద్దఎత్తున ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మేజర్ అయినా తర్వాతే వాహనాలు నడపాలని, మైనర్లు రోడ్డు మీదకు వస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. అదేవిధంగా నిషేధిత డ్రగ్స్‌కు అలవాటు పడి భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ సుందరయ్య, హెచ్‌ఎం పాల్గొన్నారు.

భవిష్యత్ అవసరాల దృష్ట్యా రోడ్ల నిర్మాణం

తుక్కుగూడ: భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఫోర్త్ సిటీకి 300 ఫీట్ల భారీ రోడ్డును ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈ రోడ్డులోనే ఫోర్త్‌సిటీకి మెట్రోరైల్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీంతో ఇక్కడి ప్రాంత ప్రజలు, రైతులకు లాభం చేకూరుతుందన్నారు. విపక్షాలు అనవసరంగా రైతులను రెచ్చగొట్టే ప్రయత్నాలు, ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు.

బాలల హక్కులను కాపాడుదాం



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

కొందుర్గు: బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కొందుర్గు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గోపినాథ్ అన్నారు. అంతర్జాతీయ బాలల దినోత్సవం పురస్కరించుకొని బుధవారం రాష్ట్ర వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడీడు పిల్లలను విధిగా బడిలో చేర్పించాలన్నారు. బడీడు పిల్లలను పనుల్లో పెడితే చట్ట ప్రకారం శిక్షార్హులవుతారని హెచ్చరించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చేవెళ్ల డివిజన్‌లో 90శాతం పూర్తి

- ముమ్మరంగా సమగ్ర కుటుంబ సర్వే
- ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరిస్తున్న ఎన్యుమరేటర్లు
- సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓలు, తహసీల్దార్లు



రామన్నగూడలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ విఠలేశ్వర్‌జీ

చేవెళ్ల: ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే చివరి దశకు చేరింది. చేవెళ్ల డివిజన్‌లో కొనసాగుతున్న సర్వే బుధవారం నాటికి 90శాతం పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం ముందుగా చెప్పిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 18తోనే సర్వే పూర్తి కావాల్సి ఉంది. కానీ సర్వే ప్రారంభంలోనే ఉపాధ్యాయులను తీసుకొని శిక్షణలు ఇచ్చే కార్యక్రమంలో ఆలస్యం కావటంతో ఈ తేదీలో మార్పు జరిగింది. ఈ నెలాఖరు వరకు సర్వేతోపాటు డేటా ఎంట్రీ కూడా పూర్తి చేయాల్సి ఉంది. దీంతో ఇప్పటికే ఎన్యుమరేటర్లు ఇచ్చిన కుటుంబాల సంఖ్యను దాదాపు పూర్తిచేశారు. కొంతమంది పూర్తిచేయగా.. మరికొంత మంది చివరి దశలో ఉన్నారు. ఇక సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో డేటా ఎంట్రీ చేయాల్సిన పని మాత్రం మిగిలింది. ఇప్పటికే మండల కేంద్రాల్లో డేటా ఎంట్రీలకు సంబంధించి కంప్యూటర్లు, ఆపరేటర్లను సిద్ధం చేసి ఉంచారు. అయితే ప్రభుత్వం వీరికి డేటా ఎంట్రీపై శిక్షణ ఇవ్వాల్సి ఉంది. మిగతా కార్యక్రమాలు దాదాపు పూర్తి చేశారు.

నాలుగు మండలాల్లో 90శాతం

చేవెళ్ల డివిజన్‌లోని చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్, షాబాద్ మండలాలకు సంబంధించి ఇప్పటికే గుర్తించిన కుటుంబాల ప్రకారం సర్వే దాదాపు 90శాతం వరకు పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు. పలు గ్రామాల్లో డోర్‌లాక్ చేసిన కుటుంబాలు, సర్వేకు వివరాలు చెప్పని కుటుంబాలు మినహా ఈ సర్వే దాదాపు ఒకటి, రెండు రోజుల్లో పూర్తవుతుందని వివరిస్తున్నారు. చేవెళ్ల డివిజన్‌లో స్టిక్కర్లు అతికించటం ద్వారా గుర్తించిన కుటుంబాల సంఖ్య 70,689లు ఉన్నాయి. ఇందులో చేవెళ్ల మండలంలో 17,023, శంకర్‌పల్లిలో మండలంలో 13,742, మున్సిపాలిటీలో 6,853, మొయినాబాద్‌లో 17,799, షాబాద్‌లో 15,272 కుటుంబాలు ఉన్నాయి. మంగళవారం నాటికి 58,948 కుటుంబాల సర్వే పూర్తి చేసినట్లు అధికారులు చెప్పారు.

రెండురోజుల్లో పూర్తవుతుంది



మండలంలో ఉన్న 146 బ్లాక్‌ల పరిధిలో 17,023 కుటుంబాలు ఉన్నాయి. ఈ సర్వేలో దాదాపు 90శాతానికిపైగా కుటుంబాల్లో సర్వే పూర్తయింది. ఇంకా 10శాతం వరకు చేయాల్సి ఉంది. అది కూడా రెండు రోజుల్లో పూర్తవుతుంది. డేటా ఎంట్రీకి సంబంధించి కూడా మండల కేంద్రంలోనే 32 కంప్యూటర్లు, 32 మంది ఆపరేటర్లను ఏర్పాటు చేసి సిద్ధంగా ఉన్నాం. గురువారం డేటా ఎంట్రీపై శిక్షణ ఇస్తున్నారు. సర్వే అనంతరం డేటా ఎంట్రీ పూర్తి చేస్తాం. సర్వేకు ప్రజలు సహకరిస్తున్నారు. కొన్నిచోట్ల డోర్ లాక్ ఉన్న కుటుంబాలకు ఫోన్‌లు చేస్తున్నాం. కొందరు స్పందించటం లేదు. వారు మినహా అన్ని కుటుంబాల సర్వే పూర్తవుతుంది.

–హిమబిందు, ఎంపీడీఓ